

ఇంటి ముందు ఆకర్షణీయమైన ముగ్గు వేస్తున్న మహిళ



పాయకరావుపేటలో ఏర్పాటు చేసిన పూలు, బొకేల షాపు

కొంగొత్త ఆశలతో..

కాలగర్భంలో మరో ఏడాది కలిసిపోయింది. తీపి, చేదు జ్ఞాపకాల కలయికతో చరిత్రలో మిగిలిపోయింది. చివరి ఘడియలను ఉల్లాసంగా గడిపి నూతన ఏడాదిలోకి అడుగు పెట్టేందుకు ప్రజలు ఏర్పాట్లు చేసుకున్నారు. కొత్త ఏడాది. ఎన్నో ఆశలు..ఆకాంక్షలు.. నూతన ఆలోచనలు..అవి సాధించేందుకు ప్రణాళికలు.. ఇదే యువతరం మాట..బాట. ప్రతి ఏడాది లక్ష్యాలు నిర్దేశించుకోవడం.. వాటిని సాకారం చేసుకోవడం ఇదే యువత మంత్రం. – నక్కపల్లి/యలమంచిలి రూరల్/కోటవురట్ల/మునగపాక

- నూతనోత్సాహంతో కొత్త సంవత్సరంలోకి..
- విద్య, ఉపాధి, ఉద్యోగాల్లో రాణించాలంటూ ఆకాంక్ష



కేక్, స్వీట్ల విక్రయాలు

పాజిటివ్ దృక్పథం అవసరం



న్యూఇయర్ అంటే వేడుకలు జరుపుకోవడం కాదు. లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. గడచిన ఏడాది ఎలా ఉంది. దాని నుంచి నేర్చుకున్న గుణపాఠాలను మననం చేసుకుని వచ్చే ఏడాది వాటిని అధిగమించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. నా విద్యాభ్యాసం అంతా ప్రభుత్వ పాఠశాలల్లోనే సాగింది. తల్లిదండ్రులు, గురువుల ప్రోత్సాహంతో మంచిగా చదువు పూర్తయింది. రాబోయే సంవత్సరంలో కూడా మంచే జరుగుతుందనే పాజిటివ్ దృక్పథంతో ఉన్నాను. పట్టుదల ఉంటే సాధించ లేనిది లేదు. ఇదే ఆలోచనతో ముందుకు సాగుతా. కొత్త ఏడాది మంచి ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చదువుతున్నాను.

– దవరశింగు భరద్వాజ్, బి.ఫార్మసీ, ఉపమాక

కోటి ఆశలతో కొత్త సంవత్సరంలోకి..



నేను బీటెక్ పూర్తి చేశాను. 2024లో ఉద్యోగం వస్తుందని ఎంతో ఆశించాను. 2025 నా జీవితాన్ని మలుపు తిప్పుతుందని ఆశిస్తున్నా. నా ఆశలను బతికించుకునేందుకు శ్రమిస్తా. లక్ష్యాన్ని చేరుకుని 2025కు కృతజ్ఞతలు చెబుతా.

– రావాడ రామకృష్ణ, బీటెక్, కె.వెంకటాపురం

మంచే జరగాలి..



కొత్త సంవత్సరంలో అంతా మంచే జరుగుతుందని ఆశిస్తున్నా. నేను ఎంబీఏ చేశా. ఉద్యోగం రాలేదు అయినా బాధపడలేదు. కానీ నేను అమితంగా ఇష్టపడే జగనన్న ముఖ్యమంత్రి కాకపోవడం నన్ను ఎంతో బాధించింది. మళ్లీ జగనన్న సీఎం అయ్యే శుభ సమయం కోసం ఎదురు చూస్తున్నా.

– గొల్లు నరేష్, ఎంబీఏ, కె.వెంకటాపురం

ఉన్నత విద్యపై దృష్టి పెడతా..



విద్య ద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. కెమికల్ రంగంలో ఉన్నత స్థానంలో రాణించేందుకు కృషి చేస్తా. యువత చేతిలోనే దేశ భవిష్యత్ ఉంది. ఇందుకు ప్రభుత్వాలు కూడా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. ఉన్నత విద్యను అభ్యసించడంపై దృష్టి పెడతాను.

– కాండ్రేగుల చరణ్, డిప్లమో కెమికల్ ఇంజినీర్, ఫైనల్ ఇయర్

కెరీర్‌పై దృష్టి పెడతా..



కెరీర్‌పై దృష్టి పెడతాను. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా అప్‌డేట్ కావడానికి ప్రయత్నిస్తా. పని చేసే రంగంలోనే ఉండిపోకుండా ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగుతా. ఎవరో వస్తారు.. ఏదో చేస్తారనే ఆలోచనలకు స్వస్తి పలకాలి. మన టాలెంట్‌ను రుజువు చేసుకునేందుకు సమయం కేటాయించాలి.

– వై.రాజకుమార్, నక్కపల్లి

పది మందికి ఉపాధి కల్పిస్తా..



కొత్త ఏడాదిలో నా లక్ష్య సాధన కోసం కృషి చేస్తాను. గతేడాది అర్ధంతరంగా మిగిలిన పనులు ఈ ఏడాది పూర్తి చేస్తాను. గత అనుభవాలు నెమరు వేసుకుని ప్రత్యేక ప్రణాళికతో స్వయం ఉపాధి ద్వారా పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాను. ఆటంకాలు ఎదురైనా లక్ష్య సాధనలో వెనుదిరగకూడదు. యువత కూడా ఆ దిశగా ముందుకెళ్లాలి.

– షేక్ బషీర్, గాంధీనగరం, యలమంచిలి

నూతన ఉత్తేజంతో ముందుకు



కొత్త ఏడాదిలో నూతన ఉత్తేజంతో ముందుకు సాగుతాను. 2024 సంవత్సరం ఎన్నో అనుభవాలు, గుణపాఠాలు, వింతలు, విశేషాలను నింపి కాలగర్భంలో కలిసిపోయింది. కాల చక్రం కంటే వేగంగా తిరిగే చక్రం మరొకటి లేదేమో అనిపిస్తోంది. 2025 న్యూ ఇయర్ కూడా అందరికీ ఆనందాలను పంచాలని కోరుకుంటున్నా..

– ఎస్‌కే ఆషియా, యలమంచిలి

న్యూఇయర్ సందడి

కోటవురట్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ టీచర్ కిషోర్ సారథ్యంలో విద్యార్థులు కొత్త ఏడాది కోసం గ్రీటింగ్ కార్డులు తయారు చేశారు. వాటిని ఉపాధ్యాయులకు ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ హెచ్‌ఎం నారాయణరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థినులకు రంగవల్లికల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించనున్నట్టు తెలిపారు.



విద్యార్థులు తయారు చేసిన గ్రీటింగ్ కార్డులతో ఉపాధ్యాయులు

నిబద్ధతతో పనిచేసే వారికి వైఎస్సార్‌సీపీలో గుర్తింపు

ఆత్మీయ సమావేశంలో యలమంచిలి ఎంపీపీ గోవింద్

యలమంచిలి రూరల్: పార్టీ అధికారంలో ఉన్నప్పుడే గాకుండా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా నిబద్ధతతో పనిచేసినప్పుడే సంతృప్తి ఉంటుందని, అలా కష్టపడిన వారిని పార్టీ అధిష్టానం, పెద్దలు ఎప్పుడూ గుర్తిస్తారని యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. 2010 డిసెంబరు 31న తాను వైఎస్సార్‌సీపీలో చేరానని చెప్పారు. ఈ మేరకు 14 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఎంపీపీ బోదెపు గోవింద్ కొక్కిరాపల్లి సమీపంలోని తన వ్యవసాయ క్షేత్రంలో యలమంచిలి, రాంబిల్లి మండలాలకు చెందిన పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక సామాన్య కార్యకర్తగా ఉన్న తనను ఎంపీపీ చేసిన ఘనత వైఎస్సార్‌సీపీదేనన్నారు. గత ఎన్నికల్లో ఓటమి గురించి నిరాశ చెందకుండా ఇప్పట్నుంచే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకుని పని చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొద్దేడ ప్రసాద్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొద్దపు యర్రయ్యదొర, మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు సత్య గుప్త, బొద్దపు అప్పన్నదొర, కొల్లి త్రినాథ్, నగిరెడ్డి మురళీకృష్ణ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గోవింద్

తూర్పు కాపులుగా గుర్తించాలని వినతి

పాయకరావుపేట: మండలంలో ఉన్న కాపులను తూర్పు కాపులుగా గుర్తించి బీసీడీ ధ్రువ పత్రాలు మంజూరు చేయాలని రాష్ట్ర కాపునాడు ఉపాధ్యక్షుడు జగతా శ్రీనివాస్, తూర్పు కాపు మండల అధ్యక్షుడు ధనిశెట్టి తిరుమల్లేశ్వరరావు కోరారు. ఈ మేరకు పాయకరావుపేటలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో అధికారులకు వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జగతా శ్రీనివాస్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ఉమ్మడి మూడు జిల్లాల పరిధిలోని కాపులను ప్రభుత్వం తూర్పు కాపులుగా గుర్తించి బీసీడీ ధ్రువపత్రాలను మంజూరు చేస్తుందని, పాయకరావుపేటలో తూర్పు కాపులుగా గుర్తించాలన్నారు.

శత శాతం ఉత్తీర్ణత లక్ష్యం



అభ్యసన సామర్థ్యాలు పరీక్షిస్తున్న డిప్యూటీ డీఈవో

కోటవురట్ల: పదో తరగతి పరీక్షలలో శత శాతం ఉత్తీర్ణతను సాధించాలని డిప్యూటీ డీఈవో పి.అప్పారావు ఆకాంక్షించారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులను ఆయన మంగళవారం పరిశీలించారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించి పరీక్షల్లో అవలంబించాల్సిన అంశాలపై సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ 100 రోజుల ప్రణాళికను విజయవంతం చేయాలన్నారు.

గ్రేడ్‌లతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

మునగపాక: గ్రేడ్‌లతో సంబంధం లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సీపీఎం నేత ఎస్.బ్రహ్మాజీ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన పాటిదిబ్బ, పేటకట్టు, పురిటిగెడ్డ తదితర ప్రాంతాల్లో దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్నా ఇంత వరకు అధికారులు ఎటువంటి సర్వే చేయకపోవడం విచారకరమన్నారు.

హక్కులపై అవగాహన అవసరం

మునగపాక: ప్రతి ఒక్కరూ హక్కులపై అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు కోరారు. మండలంలోని చూచుకొండ దళితవాడలో మంగళవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా సోదర భావంతో మెలగాలన్నారు. ఎంపీటీసీ కాండ్రేగుల కిరణ్‌కుమార్, పాల సంఘం మాజీ అధ్యక్షుడు కాండ్రేగుల నాయుడు, వీఆర్వో హిమబిందు పాల్గొన్నారు.